క్లుప్తంగా

నేడు 'అల్లూరి' విగ్రహావిష్కరణ



బాపట్ల అర్బన్: బాపట్ల సూర్యలంక రోడ్డులో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని క్షత్రియ సేవా సంఘం సభ్యులు శనివారం విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు మంతెన ఆనంద గజపతి రాజు, వైస్ ప్రెసిడెంట్ పెనుమంచు నటరాజు, కార్యదర్శి కాకర్లపూడి భాస్కర్ రాజు, ట్రెజరర్ చంపాటి జయ నాగరాజు, సభ్యులు గొట్టిముక్కల కృష్ణం రాజు, సాగి సుబ్బరాజు, గోకరాజు రామకృష్ణం రాజు, గణపతిరాజు ఆంజనేయ రాజు, ముదునూరి కనకరాజు, మంతెన విష్ణు వర్ధన్ రాజు, వేగిరాజు హరి రామరాజు, చింతలపాటి సురేష్ పాల్గొన్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నగరం(రేపల్లె): వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రిపాలెం గ్రంథాలయ నిర్వాహకుడు జొన్న బ్రహ్మేంద్ర తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరంలో కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణఇవ్వనున్నట్లు చెప్పారు. మంత్రిపాలెం గ్రంథాలయంలో మే 8 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

విధిగా హెల్మెట్ ధరించాలి



వెల్లటూరు(భట్టిప్రోలు): ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నో యాక్సిడెంట్ డే నిర్వహించారు. వెల్లటూరు బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు, ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా విధించడమే కాక జైలు శిక్ష కూడా పడుతుందని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ కె.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను బాపట్ల ఉప విద్యాశాఖాధికారి జి.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. హెచ్ఎం జి. భానుమతి, పనులు నిర్వహిస్తున్న ఎస్ఎంసీ కమిటీకి ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వీర్లంకమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

కర్లపాలెం: పెద పులుగువారి పాలెంలో ఆదివారం ఉదయం చిన అక్కలవారి కులదేవత శ్రీ వీర్లంకమ్మ అమ్మవారి, పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేడుకగా పోలేరమ్మ జాతర

వేమవరం(భట్టిప్రోలు): వేమవరంలో కొలువైన పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఘటం కుండ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

8 నుంచి గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు

కొల్లూరు: విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించే ధ్యేయంతో గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని కొల్లూరు, అనంతవరం శాఖా గ్రంథాలయాధికారులు వై.రాంబాబు, కనకదుర్గ శనివారం తెలిపారు. ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు నిర్వహించనున్న ఈ శిబిరాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు, పుస్తక సమీక్షపై ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు అన్నమయ్య జయంతి

తెనాలి: స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో అన్నమయ్య 615వ జయంతిని నిర్వహించనున్నట్లు కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. వీరితో సంస్థ సభ్యుడు లక్కరాజు లక్ష్మణరావు ఉన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకుంటాం

జాయింట్ కలెక్టర్ శ్రీధర్



బేతపూడి గ్రామంలో మొక్కజొన్న పొలాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

రేపల్లె రూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ చెప్పారు. అకాల వర్షాలతో నీట మునిగి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి, శనివారం ఆయన పరిశీలించారు. మండలంలోని బేతపూడి గ్రామంలో రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేయాలని ఇప్పటికే ఆయా మండల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పంట నష్ట పరిహారం అంచనాల తయారీలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కొల్లూరు మండలంలో పంట అధికంగా నష్టపోయినట్లు గుర్తించామన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మరో నాలుగు రోజుల పాటు రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీఏ అక్తర్ హుస్సేన్, ఏఓ విజయ్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రా శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు పంట కొనుగోలు

చుండూరు(భట్టిప్రోలు): ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తహసీల్దారు బి.కనకదుర్గ తెలిపారు. శనివారం చుండూరు మండలం వలివేరు, చినపరిమి గ్రామాల్లో ఏఓ బి.ఆదాంబాబుతో కలసి ఆమె పంట పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జొన్న, మొక్క జొన్న పంట కూడా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు అధైర్య పడొద్దని తెలిపారు. సూర్పిళ్ల వాయిదా వేసుకోవాలని సూచించారు. రెవిన్యూ, వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధం

బాపట్ల: తడిసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్డీఓ రవీంద్రబాబు పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని కొండభొట్లువారి పాలెం గ్రామంలో తడిసిన మొక్కజొన్నను ఆయన పరిశీలించారు. మండలంలో మొక్కజొన్న 700 ఎకరాల్లో సాగు చేస్తుండగా.. 76 ఎకరాల్లో పైరు స్వల్పంగా దెబ్బతిందని ఏఓ శారద ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఆర్డీఓతోపాటు ఆర్‌బీకే ఇన్‌చార్జ్ ఎం.దీప్తి ఉన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి పంట నష్టం వివరాలు



వలివేరులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఏఓ



మొక్కజొన్న గింజలను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఏఓ

కొల్లూరు : క్రాప, కొల్లూరు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో తడిచిన మొక్కజొన్న పంటను వ్యవశాయశాఖాధికారి వెంకటేశ్వరరావుతో కలిసి తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులు అధికారులు వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. పంట నష్టం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తడిచిన పంటను కొనుగోలు చేయించే ఏర్పాట్లు చేస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్రబాబు

మొక్కజొన్న పంట పరిశీలన

ఓలేరు(భట్టిప్రోలు): అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను ఎంపీపీ లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరుపీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ నీలా సాంబమ్మ, ఏఓ గొల్లపోతు మీరయ్యతో కలసి శనివారం ఓలేరులో పరిశీలించారు. ఆర్బీకేల ద్వారా తమ పంటలను రైతులు విక్రయించుకోవాలని ఎంపీపీ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో రైతులు పరుచూరి వేణు, నాదెళ్ల ప్రభాకరరావు, వేములపల్లి రవి, కె.మల్లికార్జునరావు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం



ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: బాపట్ల గ్రామ పంచాయతీలోని నందిరాజు తోటలో రూ. 21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ, ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఎ.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రైతు దేశానికి వెన్నెముక లాంటివాడని, అలాంటి అన్నదాతకు కష్టం వచ్చినప్పుడు తానున్నానని రైతుకి భరోసా కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను అంకితభావంతో ఉద్యోగులు అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పిన్ని బోయిన ప్రసాద్, డైరెక్టర్ మీరాబీ, పశు సంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు, డీఈ రామారావు, ఈవోపీఆర్డీ పులిశరత్ బాబు, మండల వ్యవసాయ అధికారి శారద, అసిస్టెంట్ ఇంజినీర్ మోహనరావు, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, వడ్డి ముక్కల డేవిడ్, మాజీ చైర్మన్ గవిని కృష్ణ మూర్తి, దివ్యాంగుల సంఘం నేత చల్లా రామయ్య పాల్గొన్నారు.

బంగారు తల్లి.. భక్తుల కల్పవల్లి



బంగారు ఆభరణాలను బ్యాంకు నుంచి తీసుకుంటున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

- బండ్లమ్మకు పురాతన బంగారు ఆభరణాల అలంకరణ
- దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం



బంగారు ఆభరణాల అలంకరణలో బండ్లమ్మ

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసియున్న బగళాముఖి బండ్లమ్మ కొలువులను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండప నిర్మాణంలో లభ్యమైన బంగారు ఆభరణాలను చందోలు ఎస్‌బీఐ శాఖ లాకరు నుంచి అధికారుల సమక్షంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, రమాదేవి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. అమ్మవారిని బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించడంతో దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి, టి.శ్రీనివాసరావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, చందోలు ఎస్ఐ రాజశేఖర్ బ్యాంక్ నుంచి బంగారు ఆభరణాలను భద్రతగా దేవాలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజీ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లీలా శ్రీనివాసరెడ్డి, కనికిచర్ల ప్రసాద్, భవనంవారి పాలెం మాజీ సర్పంచ్ భవనం భసివిరెడ్డి, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ దోమ నాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు నరసారెడ్డి, బళ్ళారెడ్డి, కుంచల శ్రీనివాసరెడ్డి, చందోలు గ్రామ కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రత్యేక బందోబస్తు..

బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, చందోలు ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు చర్యలు తీసుకున్నారు. దేవాలయం ఆవరణలో భక్తులకు దేవాదాయ శాఖ ఆవరణలో సంగం డెయిరీ సహకారంతో మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్‌లను భక్తులకు ఉచితంగా అందజేశారు.

పూండ్లలో ఘనంగా లూథరన్ చర్చి ప్రతిష్ట



ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో శనివారం ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చి ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. క్రైస్తవ సోదరులు కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవ సందేశాన్ని విన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. యువ పారిశ్రామికవేత్త కాటి విజయకుమార్ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని సంఘస్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

కమనీయం శ్రీనివాసుని కల్యాణం

భట్టిప్రోలు: లక్ష్మీ పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం శనివారం భట్టిప్రోలులో ఘనంగా నిర్వహించారు. మద్దుల లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో చీదెళ్ల ఉమామహేశ్వరరావు, శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చుండూరు కల్యాణి, పులికొండ దేవసేన ఆండాళ్, తూనుగుంట్ల సుధారాణి, పాలకుర్తి నిర్మల, మానేపల్లి ధనలక్ష్మి, బూర్లె రోజరాణి తదితరులు పాల్గొన్నారు.

కుండపోత..రైతుకు గుండెకోత

కొల్లూరు/భట్టిప్రోలు/రేపల్లె: అకాల కుండపోత వర్షం.. మొక్కజొన్న రైతులకు గుండెకోతనే మిగులుస్తోంది. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో.. పంటను రక్షించుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. శనివారం కురిసిన కుండపోత వర్షం భారీ నష్టాన్ని మిగిల్చింది. మధ్యాహ్నం కొల్లూరు మండలంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దాటికి మొక్కజొన్న పంట నీట మునిగింది. టార్పాలిన్ పట్టలు కప్పినప్పటికీ.. భారీ వర్షానికి మొక్కజొన్న పంట నీట మునగక తప్పలేదు. మండలంలో మొక్కజొన్న పంట 7,372 ఎకరాల్లో సాగు చేయగా, 30 శాతం పంటను రైతులు వర్షాలకు ముందే అమ్మేశారు. మిగిలిన పంట కోతకు వచ్చిన సమయంలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు ఓదెలపై ఉన్న మొక్కజొన్న కండెలు వర్షపు నీటిలో నానుతున్నాయి. మొక్కజొన్న కండెలు, గింజలను గుట్టలుగా చేసి టార్పాలిన్ కప్పుకుని కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వర్షపు నీరు గుట్టలు చుట్టూ నిలిచిపోయింది. వర్షపు నీటిని బయటకు మళ్లించేందుకు రైతు కుటుంబాలు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నాయి. మండలంలో సుమారు 2,500 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లి ఉండవచ్చునని వ్యవసాయశాఖాధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇటుక పరిశ్రమకు సైతం వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించింది. పచ్చి ఇటుకలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

రైతన్నల పాట్లు

భట్టిప్రోలు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. పంట పొలాలు వర్షం కారణంగా చిత్తడిగా మారడంతో మొక్కజొన్న పంటను ట్రాక్టర్లతో హైవేపై తీసుకొచ్చి ఆరబెట్టారు. సాయంత్రం వర్షం పడటంతో వాటిని కాపాడుకునేందుకు పరుగులు తీశారు. భట్టిప్రోలులో శనివారం 11.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు సహాయ గణాంకాధికారి కొండలరావు తెలిపారు.

కమ్మిన కారుమబ్బులు..

రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లిలో 90.6మి.మీ, రేపల్లెలో 76.2మి.మీ, నగరంలో 42.8 మిల్లీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లు జలమయం అయ్యాయి. చెరుకుపల్లి మండలంలో వేరుశనగ పంటను రైతులు భద్రపరుచుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.



కొల్లూరు వద్ద వర్షపు నీటిలో నానుతున్న ఓదెల్లో ఉన్న మొక్కజొన్న కండెలు



క్రాపలో వర్షాలకు తడిచి ముద్దవుతున్న సీసీ రోడ్డుపై ఆరపెట్టిన మొక్కజొన్న గింజలు



కొల్లూరులో వర్షానికి నీట మునిగిన మొక్కజొన్న గింజలను ఆరపెట్టుకునేందుకు..



వర్షపు నీటిలో మొక్కజొన్న గింజలు మునగడంతో ఆయిల్ ఇంజన్ సాయంతో..ఇలా..



భట్టిప్రోలులో హైవేపై వేమవరం వద్ద మొక్కజొన్నను ఆరబెడుతున్న వ్యవసాయ కూలీలు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లె రూరల్: ఐసీడీఎస్ రేపల్లె సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ మాణిక్యం తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె పట్టణంలోని 12వ వార్డు వడ్డెర కాలనీ (ఓసీ), 13వ వార్డు ఉప్పూడి రోడ్డు-1 (ఎస్టీ), 23, 26 వార్డుల్లోని ఓల్డ్ బరియల్ గ్రౌండ్ (బీసీ-డీ), 22వ వార్డులో లంబాడి కాలనీ (ఎస్టీ), రేపల్లె మండలం నల్లూరిపాలెం-1 (ఓసీ ఓహెచ్), నల్లూరు నార్త్ (బీసీ-డీ), నగరం మండలం అద్దంకివారి పాలెం (బీసీ-సీ), పెద్దవరం బీసీ ఏరియా (బీసీ-డీ), తాడివాకవారి పాలెం (ఓసీ ఓహెచ్), సిరిపూడి పరిసవారి పాలెం (ఓసీ), శివంగులపాలెం (ఓసీ), కొలగానివారి పాలెం (బీసీ-డీ) తదితర గ్రామాల్లో ఆయా సామాజిక వర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. వివాహిత, గ్రామ పరిధిలో నివాసం ఉండాలని ఉండాలన్నారు. 2023 జనవరి 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తమ దరఖాస్తుతో పాటు విద్యార్హత ధృవీకరణ పత్రాల నకళ్లతో ఈ నెల 15లోపు కార్యాలయంలో అందించాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ సుందర రామయ్యకు ఘన నివాళి



డాక్టర్ సందీప్‌కు బంగారు పతకం ప్రదానం

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.సుందరరామయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బోసు రోడ్డులోని శాఖ కార్యాలయంలో శనివారం పలువురు వైద్యులు డాక్టర్ సుందర రామయ్య సేవలను స్మరించుకున్నారు. సభలో విజయవాడకు చెందిన ప్రముఖ రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వెలిచేటి సందీప్ 'బేసిక్స్ అండ్ క్లినికల్ అప్లికేషన్స్ ఆఫ్ ఎంఆర్ఐ విత్ రీసెంట్ అడ్వాన్సెస్' అన్న అంశంపై స్మారకోపన్యాసం చేశారు. డాక్టర్ సందీప్‌కు ఐఎంఏ సభ్యులు డాక్టర్ సుందర రామయ్య స్మారక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, పాల్గొన్నారు.

పదింతల ఆనందం

■ **వేమూరు:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వేమూరు మండలం 61 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎంఈఓ కాజా లక్ష్మీ నారాయణ వివరాలు వెల్లడించారు. మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఆరు ఉన్నాయి. 263 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 161 మంది ఉతీర్ణత సాధించారు.

■ **చెరుకుపల్లి:** మండలంలోని 12 ఉన్నత పాఠశాలల నుంచి పదవ తరగతి పరీక్షలకు 642 మంది విద్యార్థులు హాజరు కాగా 430 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 308 మందికి 176 మంది, బాలికలు 334 మందికి 254 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 69.4 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీఆర్ఎస్‌జీ వినయాశ్రమం ఉన్నత పాఠశాల 93.4 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. తూర్పుపాలెంలోని బాపూజీ ఎయిడెడ్ పాఠశాల 30.0 శాతం ఉత్తీర్ణత సాధించి, చివరి స్థానంలో నిలిచింది.

■ **భట్టిప్రోలు:** పెద పులివర్రు హైస్కూల్ వరుసగా రెండోవ సారి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని 5 జెడ్పీ, 2 ఎయిడెడ్, 4 అన్ ఎయిడెడ్ హైస్కూళ్ల నుంచి 551 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 390 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ పులి లాజర్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జి.భానుమతి, ఎస్కే మహబూబ్ బాషా, వి.నాగేశ్వరరావు, ఎంఈవో లాజర్ తదితరులు అభినందించారు. గతేడాది మండలంలో 83.6 శాతం ఉత్తీర్ణత రాగా.. ఈ ఏడాది 70 శాతానికి పడిపోవడం గమనార్హం.

■ **కర్లపాలెం:** మండలంలోని మొత్తం 10 పాఠశాలలకు చెందిన 409 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 241 మంది ఉత్తీర్ణత సాధించారు. పెదగొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల అత్యల్పంగా 23.53శాతం ఫలితాలు సాధించింది.

నిజాంపట్నం: మండలంలో 643 మంది విద్యార్థులు పదో తరగతి పరిక్షలకు హాజరు కాగా.. 482 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ హరిబాబు తెలిపారు.

■ **కొల్లూరు:** మండలంలోని నాలుగు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు 8 కలిపి మొత్తంగా 468 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 68 శాతం ఉత్తీర్ణతతో 318 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పదోతరగతి పరీక్షలలో ఉత్తమంగా రాణించిన దొక్కు ధనలక్ష్మి, ఇతర విద్యార్థులను హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపల్లె: పదో తరగతి పరీక్ష ఫలితాలను మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో నవీన్‌కుమార్ శనివారం ప్రకటించారు. 12 ప్రభుత్వ, 3 ఎయిడెడ్, 13 ప్రైవేటు పాఠశాలల నుంచి 1214 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా, 983 మందితో 81శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. పేటేరు పాఠశాల నుంచి 118 మంది విద్యార్థులు హాజరుకాగా, 91 మంది ఉతీర్ణత సాధించారు.

■ **చుండూరు(వేమూరు):** మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల ఉతీర్ణ 87 శాతం సాధించినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ చీకటి రవికాంత్ తెలిపారు. జెడ్పీ, ఎయిడెడ్ 8 పాఠశాలలున్నట్లు తెలిపారు. 382 మంది పరీక్షలకు హాజరు కాగా 230 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గురుకల పాఠశాల విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ రమేష్ శనివారం తెలిపారు. చుండూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకల పాఠశాలో 63 మంది పరీక్షలకు హాజరు కాగా, 38 మంది ఉత్తీర్ణత సాధించారు.

■ **అమర్తలూరు:** అమర్తలూరు మండలం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 67 శాతం ఉతీర్ణత సాధించింది. ఎంఈఓ చీకటి రవికాంత్ తెలిపారు వివరాలు వెల్లడించారు. మండలంలోని జెడ్పీ ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలలు 10 ఉన్నాయి. 287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 192 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 96 మంది, బాలురు 96 మంది ఉన్నారు.